

జన చేతనం
పాడేరు...తీరే వేరు
మునిసిపల్ చైర్మన్ నుంచి ఎమ్మెల్యే
నాడు గ్రామాభ్యుదయం నేడు వ్యక్తిగతం... ·7లో

టెన్త్‌లో బాలికలదే పైచేయి

జిల్లాలో పది పరీక్షల్లో 89.04 శాతం ఉత్తీర్ణత

- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 12వ స్థానం
- బాలికల ఉత్తీర్ణత శాతం 91.45
- బాలుర ఉత్తీర్ణత శాతం 86.73



కోటిపల్లి సత్యధనస్వాతి (592/600), పాయకరావుపేట



వై.నందిని (592/600) కశింకోట



గట్టెం శ్రీలేఖ(591/600), గుంటపల్లి జడ్పీ హైస్కూల్



జి.త్రిలేషా (591/600), కశింకోట



కరణం సంజనా (588/600) అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్



డి.రఘు(588/600), వాడచీపురుపల్లి హైస్కూల్

అనకాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. సోమవారం ఏపీ విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువమంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో గత మార్చి 18 నుంచి 30 వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు 21,169 మంది బాలబాలికలు హాజరయ్యారు. వారిలో సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో 18,848 మంది (89.04 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 10,820 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 9,384 మంది (86.73 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే బాలికలు 10,349 మంది పరీక్షలు రాయగా 9,464 (91.45 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో గత ఏడాది 2023 ఏప్రిల్ నెలలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో జిల్లా లో 77.74 శాతం ఉత్తీర్ణత సాధించగా, 2024లో జిల్లాలో 89.04 శాతం నమోదైంది. దీంతో ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో 12వ స్థానంలో జిల్లా నిలిచింది.

రీ వేల్యుయేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తులు

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కానివారి కోసం మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో ఎంవీ లక్ష్మమ్మ తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచే ఆన్‌లైన్‌లో రీ వేల్యుయేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కోటిపల్లి ధనస్వాతి 592 మార్కులు సాధించింది. ఇదే మండలంలో గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గట్టెం శ్రీలేఖ 591, పాయకరావుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జానా లలితాభవాని, ఇదే మండలానికి చెందిన దూడ రఘు 588 మార్కులు సాధించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు కూడా సత్తా చాటారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ఆడారి తనుశ్రీ 595, యల్లపు షణ్ముఖప్రియ 592, కశింకోటలోని వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు వై.నందిని 592, జి.త్రిలేషా 591, రాంబిల్లి రవీంద్ర హైస్కూల్ విద్యార్థిని గనగళ్ల చాందిని 589, లోటర్ ఇన్ హైస్కూల్ విద్యార్థిని సిరసపల్లి దుర్గ 588, బుచ్చెయ్యపేట మండలం జీజీఎం ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి టి.శివసాయి 589, పరవాడ మండలం వాడచీపురుపల్లి హైస్కూల్ విద్యార్థి డి.రఘు 588, తానాం గురుకుల పాఠశాల విద్యార్థిని పి.దివ్య 586, అనకాపల్లిలోని జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కరణం సంజనా 588 మార్కులు సాధించారు.

మంచినీళ్లా?.. గరళమా?

ఎడ్లవీధిలో కలుషిత నీరు సరఫరా

- స్థానికుల ఆందోళన

చోడవరం, ఏప్రిల్ 22: పట్టణంలోని ఎడ్లవీధిలో వీధి కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో మూడురోజుల క్రితమే పంచాయతీ సిబ్బంది ట్యాంకును పరిశుభ్రం చేశారు. తరువాత రెండు రోజులు బాగానే నీరు సరఫరా అయినప్పటికీ, తిరిగి సోమవారం ఎస్‌సీ కాలనీ తదితర ప్రాంతాల్లో కొళాయిల నుంచి వచ్చేనీరు నల్లగా ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ ఈవో నారాయణరావు మాట్లాడుతూ ఎడ్లవీధిలోని రక్షిత మంచినీటి పథకాన్ని రెండు రోజుల క్రితమే శుభ్రం చేశారని, అయినప్పటికీ కొళాయిల నుంచి నీరు నల్లగా ఎందుకు వస్తున్నదీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకవేళ వీధుల్లో కొళాయిలకు సరఫరా అయ్యే నీటిపైపులలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నట్టయితే సిబ్బందితో వాటిని సరిచేయిస్తామని తెలిపారు.



ఎడ్లవీధిలోని కొళాయిల నుంచి వస్తున్న కలుషిత నీరు

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

నామినేషన్ల సందడి

అనకాపల్లి ఎంపీ స్థానానికి ఐదు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 12 నామినేషన్లు



ఆర్వో కె.గీతాంజలికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని అనిత, చిత్రంలో సీఎం రమేశ్ తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి ఐదు, జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. శంకరంలోని కలెక్టరేట్‌కు చేరుకుని మధ్యాహ్నం ఒంటిగంటకు ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లతో కలిసి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి మూడు నామినేషన్ సెట్లను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఎస్‌కే సఫీ ఉల్లా, సిద్ధా లోవ రాజు, వంకాయల రామచంద్రరావు, బీఎస్పీ తరపున పలకా శ్రీరామ్మూర్తి నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ స్థానాలకు..

చోడవరం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ సోమవారం తన సోదరుడు జయదేవ్, వైసీపీ నాయకుడు న్యాయవాది కాండ్రేగుల డేవిడ్‌తో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి ఆర్వో చిన్నికృష్ణకు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మాడుగుల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట పీవీజీ కుమార్, వీర సురేఖ ఉన్నారు.

అలాగే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఈర్లె అనురాధ మూడు నామినేషన్ సెట్లు వేయగా, చింతల బుల్లిలక్ష్మి, గొల్లవిల్లి ప్రభావతి, రెడ్డి అరుణ ప్రతిపాదించారు. అనురాధకు డమ్మీగా ఆమె తల్లి బూడి రమణమ్మ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా కర్రి లక్ష్మి, బూరే బాబూరావులు ప్రతిపాదించారు. కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు బుచ్చి సత్య శ్రీనివాసరావు రెండు సెట్ల నామినేషన్లు వేయగా, బొడ్డు అప్పలనాయుడు ప్రతిపాదించారు. టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత ఆర్వో కె.గీతాంజలికి ఒక సెట్ నామినేషన్‌ను అందజేశారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన నేత గెడ్డం బుజ్జి, ఎస్.రాయవరం మాజీ ఎంపీపీ ఏజర్ల వినోద్‌రాజులతో కలిసి నామినేషన్ సమర్పించారు. అలాగే వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు నామినేషన్ వేశారు. జైభారత్ నేషనల్ పార్టీ తరపున దొరలపాటి నాగేశ్వరరావు నామినేషన్ వేశారు. అయ్యన్నపాత్రుడు చిన్నకుమారుడు, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ నర్సీపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా డమ్మీ నామినేషన్ వేశారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సమాజ్‌వాది పార్టీ తరపున ఒమ్మి వెంకటయాదవ్, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్‌గా ఇరుపల్లి కాసులు నామినేషన్ వేశారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి

నిప్పుల కుంపటి

జిల్లాలో మండుతున్న ఎండలు

- రావికమతంలో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



బోసిపోయిన అనకాపల్లి గాంధీనగరం రోడ్డు

అనకాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం ఐదు గంటల వరకు వేడి గాలులు కొనసాగుతున్నాయి. సోమవారం రావికమతంలో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దేవరాపల్లిలో 44.2, చీడికాడ 44.2, చోడవరం 43.9, బుచ్చెయ్యపేట 43.2, గొలుగొండ 43, మాడుగుల 43, రోలుగుంట 42.9, కశింకోట 42.7, మాకవరపాలెం 42.4, కోటవురట్ల 42.4, నర్సీపట్నం 42.1, కె.కోటపాడు 41.4, సబ్బవరం 41.2, అనకాపల్లిలో 41.1 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో 24 మండలాలు ఉండగా, సోమవారం 14 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. దీంతో మధ్యాహ్నం వేళలో రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండ వేడితో పాటు ఉక్కపోతకు జనం విలవిల్లాడారు.

కోల్ యార్డులన్నీ ఖాళీ..!

స్టీల్‌ప్లాంటులో గత 33 ఏళ్లలో ఇదే తొలిసారి

ప్లాంటులో ఉక్కు ఉత్పత్తికి తీవ్ర విఘాతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) అసలే ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్.. బొగ్గు కొరత కారణంగా ఉత్పత్తికి విలవిల్లాడుతోంది. అదానీ గంగవరం పోర్టులో 12 రోజులుగా జరుగుతున్న సమ్మె వల్ల కన్వేయర్ బెల్ట్ ద్వారా రావలసిన ముడి పదార్థాలన్నీ ఆగిపోవడంతో స్టీల్‌ప్లాంటులోని కోల్ యార్డులన్నీ ఖాళీ అయిపోయాయి. ఆర్థిక వనరులకు ఇబ్బంది పడుతున్న స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఉద్యోగులకు జీతాలు ఆపి మరీ ఆస్ట్రేలియా నుంచి మూడు దఫాలుగా నౌకల ద్వారా కోల్‌ను దిగుమతి చేసుకుంది. అయితే 3.09 లక్షల టన్నుల కోల్, మరో 60 వేల టన్నుల డోలమైట్ గంగవరం పోర్టులోనే ఉండిపోయింది. వాటిని కన్వేయర్ బెల్ట్ ద్వారా స్టీల్‌ప్లాంటుకు పంపాల్సి ఉండగా, పోర్టులో కార్మికుల సమ్మె ఫలితంగా ఆ నిల్వలు అక్కడే ఉండిపోయాయి. దాంతో ప్లాంటులో ఉత్పత్తికి తీవ్ర విఘాతం ఏర్పడింది. ఇప్పటికిప్పుడు డబ్బులు పెట్టి బహిరంగ మార్కెట్‌లో అవసరమైనవి సమకూర్చుకునే శక్తి లేకపోవడంతో ఇతర ప్రభుత్వ రంగ సంస్థలైన సెయిల్, ఎన్ఎండీసీలను అభ్యర్థించి 8వేల టన్నుల కోల్‌ను సమకూర్చుకుంది. మరో రెండు నౌకల ద్వారా 75 వేల టన్నుల చొప్పున బొగ్గు విదేశాల నుంచి రాగా ఆ నౌకలను గంగవరం నుంచి విశాఖ పోర్టుకు తరలించి, అక్కడి నుంచి ర్యాక్‌లు, రోడ్డు మార్గాన తెప్పించుకునే ప్రయత్నం చేస్తోంది.

వైసీపీలో కలవరం

ముఖ్యమంత్రి, పార్టీ అధినేత రోడ్‌షో చప్పగా సాగడంతో అభ్యర్థుల్లో ఆందోళన

- ఆసాంతం అభివాదాలు, నమస్కారాలే
- ఒక్కచోట కూడా ప్రసంగించలేదు
- కనీసం అభ్యర్థులనైనా ప్రజలకు పరిచయం చేయలేదని అసంతృప్తి
- మిగతా ప్రాంతాలకు భిన్నంగా విశాఖలో ప్రచారం
- ప్రజల నుంచి ఆశించిన స్పందన లేకపోవడమే కారణమనే అభిప్రాయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్‌షో చప్పగా సాగడంతో ఆ పార్టీ నేతలు, అభ్యర్థులు నిరాశకు గురయ్యారు. రోడ్‌షో ఆసాంతం అభివాదాలు/నమస్కారాలతోనే సీఎం జగన్ ముగించేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ముఖ్యమంత్రి రోడ్‌షో నిర్వహించడంతో పాటు 'మేమంతా సిద్ధం' పేరిట ఏర్పాటుచేసిన సభల్లో పాల్గొన్నారు. ఆ జిల్లాలో పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేసి, గెలిపించాల్సిందిగా కోరారు. కానీ, నగరంలో అందుకు భిన్నంగా వ్యవహరించడం పార్టీ వర్గాలతోపాటు ప్రజల్లో చర్చనీయాంశమైంది.

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్మోహన్‌రెడ్డి గత ఇరవై రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం జగన్ నగరంలో వేపగుంట జంక్షన్ నుంచి పీఎం పాలెం వరకూ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్కడా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించలేదు. రోడ్‌షో ఆసాంతం బస్సుపై నిలబడి, కొన్నిచోట్ల లోపల కూర్చొని ప్రజలకు నమస్కారం/అభివాదం చేయడంతోనే సరిపెట్టేశారు. ఆయా నియోజకవర్గాల్లో రోడ్‌షో చేస్తున్నప్పుడు కనీసం అక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థిని పరిచయం చేసే ప్రయత్నం చేయకపోవడంపై పార్టీ నేతల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. బస్సు యాత్రలో భాగంగా జగన్ ప్రతి జిల్లాలో ఏదో ఒకచోట సభలో పాల్గొన్నారు. అక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేసి, వారిని పొగుడుతూ ఓట్లేయాలని విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లాలో కూడా సభ నిర్వహించడంతోపాటు పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు. అలాంటిది రాష్ట్ర పరిపాలనా రాజధానిగా తాను స్వయంగా ప్రకటించిన విశాఖ నగరంలో మాత్రం ఎక్కడా ఒక సభ కూడా ఏర్పాటుచేయకపోవడం, నగర పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థులను కనీసం పరిచయం చేయకుండానే బస్సు యాత్రను ముగించడం పార్టీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. జనాల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో సీఎం నిరుత్సాహానికి గురై ఉంటారని, అందుకే మొక్కుబడిగా రోడ్‌షో ముగించేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామం తమ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోందని వైసీపీ నేతలే పేర్కొంటున్నారు. సీఎం జగన్ ఎన్నికల ప్రచారం నిమిత్తం వస్తున్నారని తెలిసి నగర పరిధిలో ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులంతా చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రజల నుంచి సీఎం జగన్‌కు ఆశించిన స్థాయిలో ఆదరణ కానరాకపోవడంతో వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారు.



విశాఖలోని నాయుడుతోట ప్రాంతంలో ఆదివారం జగన్ బస్సు యాత్రలో కనిపించని జనం

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

- ప్రభుత్వ స్థలాన్ని జిరాయితీగా మార్చిన వీఆర్వోను సస్పెండ్ చేయాలని డిమాండ్
- అప్పలమ్మపాలెం గ్రామస్థుల ఆందోళన




తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అప్పలమ్మపాలెం గ్రామస్థులు

రావికమతం, ఏప్రిల్ 22: మండలంలోని మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెంలో గల కాలనీలో ఉమ్మడిగా కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన ఆరు సెంట్ల స్థలాన్ని ఆన్‌లైన్‌లో జిరాయితీగా మార్పు చేసిన వీఆర్వో నారాయణరావును వెంటనే సస్పెండ్ చేయాలంటూ ఆ గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీఆర్వోను సస్పెండ్ చేయాలని నినాదాలు చేస్తూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యాలయంలో బైఠాయించారు. గ్రామంలో సామాజిక భవనానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 8న అప్పలమ్మపాలెం గ్రామస్థులు తహసీల్దార్ రమణారావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్.. ఆర్ఐ సతీశ్‌ను విచారణ చేపట్టి వాస్తవ నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు వీఆర్వో నారాయణరావుతో కలిసి ఆర్ఐ సతీశ్ గ్రామంలో రెండు పర్యాయాలు బహిరంగ విచారణ చేపట్టారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను వారికి గ్రామస్థులు అందజేశారు. అయితే ఈ స్థలాన్ని సర్వే చేసి వాస్తవాలు తేలే వరకు ఇక్కడ ఏ విధమైన నిర్మాణాలు చేపట్టరాదని ఆర్ఐ తెలిపారు. అయితే సర్వే చేయడంలో జాప్యం జరగడం, ఆక్రమణదారులు ఆ స్థలంలో పనులు చేస్తుండడంతో గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే ఉన్న వీఆర్వోను నిలదీశారు. ఆక్రమణదారులకు కొమ్ముకాస్తారా? అని ధ్వజమెత్తారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రావికమతం ఎస్ఐ ధనుంజయనాయుడు అక్కడికి వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఈ స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నిమ్మాదాల అప్పారావు, పైల సత్యారావు, రమణమ్మ, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.



వీఆర్వో నారాయణరావును నిలదీస్తున్న దృశ్యం





జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

» సీడీసీ మాజీ చైర్మన్ సహా 50 మంది చేరిక

చోడవరం, ఏప్రిల్ 22: అధికార పార్టీ వైసీపీ నుంచి బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన చెరకు అభివృద్ధి మండలి (సీడీసీ) మాజీ చైర్మన్ కర్రి తమ్ము నాయుడు సహా మాజీ సర్పంచ్ కర్రి రాముతో పాటు 50 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం జనసేనలో చేరారు. చోడవరంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పీవీఎస్ఎన్ రాజు వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీడీపీ చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, గేదెల సత్య నారాయణ, జనసేన నాయకులు అల్లం రామప్పారావు, సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, నరవ సరోజిని, డీఎస్ నాయుడు, తుమ్మపాల రమేష్ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి బూడి ఆస్తులు రూ.7,43,92,295

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 22: అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆస్తులు రూ.ఏడు కోట్ల 43 లక్షల 92 వేల 295 విలువ చేసే స్థిర, చరాస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దేవరాపల్లి మండలం తారువా గ్రామంలోని భార్య రమణమ్మ ఆస్తులతో కలిపి తన ఆస్తులను వెల్లడించారు. వ్యవసాయ భూములు, భవనాలు, స్థలాలు వంటి స్థిరాస్తులు తన పేరున రూ. కోటి 96 లక్షల 43 వేల 683 విలువ చేసే స్థిరాస్తులు ఉండగా.. తన భార్య రమణమ్మ పేరున రూ. కోటి ఏడు లక్షల 48వేల 612 ఇద్దరికి కలిపి స్థిరాస్తులుగా చూపించారు. రూ. నాలుగుకోట్ల 36 లక్షలు చరాస్తులుగా చూపిస్తూ చెరో రెండు లక్షలు చొప్పున నగదును చూపించారు. బ్యాంక్ అప్పులు బూడి ముత్యాలనాయుడు పేరున రూ.కోటి మూడువేల 308, అతని భార్య రమణమ్మ పేరున రూ.77లక్షల 15వేల 763 బ్యాంకు అప్పులుగా చూపించారు. మూడు కార్లు ఉన్నట్టు తెలిపారు.

విశాఖ-బెంగళూరు రైళ్ల సమయాల్లో మార్పు

విశాఖపట్నం, ఏప్రిల్ 22: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, ఎస్ఎంవీ బెంగళూరు మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్ల రాకపోకల సమయాలను సాంకేతిక కారణాలతో సవరించినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. కేవలం ఎస్ఎంవీ బెంగళూరు నుంచి విశాఖ వచ్చే 08550 నంబరు గల ప్రత్యేక రైలు వేళల్లో మాత్రమే మార్పు చేసినట్టు పేర్కొన్నారు. ఈ రైలు 27 నుంచి జూన్ 29వ తేదీ నుంచి వరకు శనివారం మధ్యాహ్నం 1.15 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి 08550 నంబరు గల రైలు ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 8.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.10 గంటలకు విశాఖ చేరుతుందన్నారు.

అనకాపల్లి ఎంపీ స్థానానికి బూడి నామినేషన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. బైక్ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకుని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి మూడు సెట్ల నామినేషన్ పత్రాలను ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లతో అందజేశారు.

మద్యం రవాణాపై దాడులు చేయండి

» సెబ్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్



మాట్లాడుతున్న సెబ్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 22 : మద్యం అక్రమ సరఫరా, రవాణాను అరికట్టేందుకు సెబ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు ఉమ్మడి కార్యాచరణతో దాడులు నిర్వహించాలని సెబ్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ మద్యం పంపిణీ, అమ్మకాలను నిరోధించేందుకు రెండు శాఖలు నిఘా పెట్టి దాడులు చేయాలన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే మద్యంపై నిఘా ఉంచి దాడులు చేయాలన్నారు. మద్యం డిపో నుంచి బార్లకు సరఫరా అయ్యే మద్యం నిల్వల వివరాలు, సమాచారాన్ని ఇరుశాఖలు పంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సెబ్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

B.Ed. 2023-25
EWS Admissions
93 94 412 512

13న జగన్‌కు దేవుడు శిక్ష విధిస్తాడు



అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

» కేంద్ర పథకాల్లో అనకాపల్లికే అగ్రతాంబూలం
» ప్రజలను నమ్మించడానికి ఎన్ని నాటకలైనా వేస్తారు
» జూన్ 4న 10 గంటలకు టీవీల్లో చూడండి
» డబుల్ ఇంజన్ సర్కారు వుంటుంది
» సుజల స్రవంతి, పోలవరం కాలువ పూర్తి చేస్తా

నక్కపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

నక్కపల్లి, ఏప్రిల్ 22: ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి, ఎన్నో అన్యాయాలు చేసిన జగన్‌ను మే 13న దేవుడు శిక్షిస్తాడని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఇక్కడ జరిగిన పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన,బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఐదేళ్లలో ఎందరో అధికారులు, పాలకులు ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని, ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత వారందరికీ దబిడి,దిబిడేనని హెచ్చరించారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత కేంద్రంలో ఏ పథకం మొదలుపెట్టినా అనకాపల్లికే అగ్రతాంబూలం వుంటుందని స్పష్టంచేశారు. సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలో యువతకు గంజాయి, డ్రగ్స్ అలవాటు చేశాడని, వాటికి యువత బానిసలైతే ఇంటిలో బంగారం,డబ్బు కూడా మిగలదని సీఎం రమేశ్ చెప్పారు. ఒకసారి పంజాబ్‌లో పరిస్థితి చూస్తే అర్థమవుతుందన్నారు. 13వ తేదీన ఈవీఎం బటన్ నొక్కి, తద్వారా జగన్ పీక కొన్నాకలని పిలుపునిచ్చారు. జగన్‌తోపాటు, అతనకి కొమ్ముకాస్తున్న కొన్ని ఛానల్స్ ఎన్ని నాటకాలైనా వేస్తారని, కానీ వారి డ్రామాలను ప్రజలు విశ్వసించడం లేదని ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ చెప్పారు. కోడికత్తి డ్రామాలా, గులకరాయి నాటకం ఆడినా ప్రజలు నమ్మలేదన్నారు. ఒకసారి పాయకరావుపేట సహా, పలు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల నామినేషన్లకు వస్తున్న ప్రజలను చూపించే ధైర్యం ఆ ఛానల్స్‌కు వుందా? అని సవాల్ చేశారు. జగన్‌కు ఊడిగం చేస్తున్న ఛానల్స్ నిజం చెప్పలేక పోతున్నాయని ఎద్దేవా చేశారు.

జగన్ చెల్లెల్లే నిజం చెబుతున్నారు..

జగన్ చెల్లెళ్లు సునీత, షర్మిల నిజం చాటిచెబుతున్నారని, తమకు ఏమీ వద్దు- కానీ జగన్‌కు ఓటు వేయొద్దని వారు ప్రచారం చేయడాన్ని ప్రజలు గుర్తించాలని సీఎం రమేశ్ అన్నారు. పాయకరావుపేట నుంచి అనితను ఎమ్మెల్యేగా గెలిపిస్తే చంద్రబాబు మంత్రి పదవి ఇస్తారని సీఎం రమేశ్ చెప్పారు. ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో వుంటూ ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొని నిలిచిన ధీర మహిళ అనిత అన్నారు. ఎంపీగా గెలిచిన తరువాత అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఇంటింటా కొళాయి ద్వారా నీరిచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. ఏపీఐఐసీ భూముల్లో మంచి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. జనసేన నేత గెడ్డం బుజ్జి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అనితను, ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించుకు తీరుతామని చెప్పారు.

బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

» ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి
» జగన్‌కు మరో అవకాశమిస్తే ఏపీని అమ్మేయడం ఖాయం
» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామమూర్తి

కొత్తూరు(అనకాపల్లి), ఏప్రిల్ 22 : బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి ధ్వజమెత్తారు. సోమవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చింతలపాలెం సిద్ధం బస్సు యాత్రలో బీసీకి చెందిన ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, దీన్ని బట్టి బీసీల పట్ల సీఎం జగన్‌కు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రజావేదిక విధ్వంసంతో ప్రారంభమైన జగన్ పాలన గడచిన ఐదేళ్లలో అవినీతి, అరాచకాలు, దోపిడీలతోనే కొనసాగిందన్నారు. మరో ఛాన్స్ ఇస్తే ఇప్పటివరకు ఆస్తులు మాత్రమే తాకట్టు పెట్టారని, తరువాత ఏపీనే అమ్మకానికి పెట్టేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా మాడుగుల నియోజకవర్గంలో ఒక్క రోడ్డును కూడా వేయలేని బూడి ముత్యాలనాయుడు ఎంపీగా పోటీ చేసి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి పథంలో నడవాలంటే సీఎం రమేశ్ గెలవాలని, అప్పుడు జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఇద్దరు మంత్రులున్నారని, వీరి పని దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ప్రధాని, కేంద్ర మంత్రులతో సత్సంబంధాలున్న సీఎం రమేశ్, ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రయాణికులకు పాట్లు

» 3గంటలకు పైగా ట్రాఫిక్ అంతరాయం
» నక్కపల్లి-అడ్డరోడ్డు హైవేపై నిలిచిపోయి వాహనాలు
» ఒకే సమయంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు
» అనిత, సీఎం రమేశ్ కి.మీ నడిచి నామినేషన్ కేంద్రానికి రాక
» పోలీసు వైఫల్యంగా సీఎం రమేశ్ ఆరోపణ



అడ్డరోడ్డు-నక్కపల్లి హైవేపై నిలిచిన ట్రాఫిక్

నక్కపల్లి, ఏప్రిల్ 22: నక్కపల్లి హైవే జంక్షన్ వద్ద సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఒకే సమయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత, వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు నామినేషన్లకు ముహూర్తం పెట్టుకున్నారు. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వేలాది సంఖ్యలో నక్కపల్లికి తరలించాయి. ఉదయం 10 గంటలకే అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి వరకూ రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున దాదాపుగా 40వేలకు పైగా కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. అయితే అందుకు తగ్గ ఏర్పాట్లు పోలీస్ యంత్రాంగం చేపట్టకపోవడంతో హైవేపై పలు వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు,వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండుటెండల్లో దాదాపు 3 గంటలపాటు బస్సులు, వ్యాన్‌లు, కార్లు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. సారిపల్లివానిపాలెం హైవేకు ఆనుకుని వున్న తన నివాసం నుంచి అనిత నామినేషన్ వేసేందుకు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సహా మూడు పార్టీల నాయకులతో కలిసి ప్రచార రథంపై బయలుదేరారు. ఆ వాహనం హైవేకు చేరుకున్న ఐదారు నిమిషాలు తరువాత ముందుకు కదిలే అవకాశమే లేకపోయింది. వందల సంఖ్యలో హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. ఎన్నో సార్లు అనిత, సీఎం రమేశ్ ప్రచార రథంపై నుంచి పోలీసులు సహకరించాలని, నామినేషన్ వేసేందుకు మార్గం సుగమం చేయాలని మైక్‌లో కోరినా ఎటువంటి స్పందన లేదు. దీంతో వేరే దారి లేక సుమారు కిలోమీటరు దూరం నడుచుకుంటూ ఆర్వో కార్యాలయానికి సీఎం రమేశ్, అనిత, గెడ్డం బుజ్జి, నాలుగు మండలాల బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు చేరుకొని నామినేషన్ వేశారు. అనంతరం జరిగిన సభలో ఈ విషయంపై ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కనీసం నామినేషన్ వేసేందుకు అవకాశం లేకుండా చేశారని, పోలీసులు నిర్లక్ష్య వైఖరే కారణమని, ఇదే సమయంలో వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు రాచమార్గం కల్పించారని ఆరోపించారు.



సీఎం రమేశ్, అనిత వాహనం వచ్చేందుకు మార్గం లేకపోవడంతో ఆర్వో కార్యాలయానికి కి.మీ దూరం నడచివస్తున్న సీఎం రమేశ్, అనిత , గెడ్డం బుజ్జి

అంబరాన్నంటిన మరిడిమహాలక్ష్మి సంబరం

» నర్సీపట్నంలో వైభవోపేతంగా పెద్ద జాగరణ
» భక్తజన సందోహం నడుమ గరగల ఊరేగింపు



జాతరలో భక్తజన సందోహం... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకున్న అమ్మవారు

నర్సీపట్నం, ఏప్రిల్ 22 : పట్టణంలో మరిడిమహాలక్ష్మి అమ్మవారి పండగ సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. వివిధ ప్రధాన కూడళ్లలో వేదికలు ఏర్పాటు చేసి ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణాబజార్ కూడలిలో పల్సర్ బైక్ రమణతో రేలా రే రేలా, అబీద్ సెంటర్‌లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, అయ్యప్ప గుడి వద్ద ఆర్కెస్ట్రా, ఎస్‌కేపీటీ సెంటర్‌లో డ్యాన్స్ హంగామా వంటివి వీక్షకులను ఉర్రూతలూగించాయి. అనంతరం పెద్ద జాగరణ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా మెయిన్ రోడ్డులో మరిడి తల్లి గరగలు ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ బృందం డప్పులు, నెమలి డ్యాన్స్, శక్తి వేషాలు, నేల డ్యాన్స్‌లు, గరగల డాన్స్, నమో వెంకటేశాయ వేషధారణలు వేడుకకే వన్నెతెచ్చాయి. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన భార్య పద్మావతి, విజయ్, రాజేశ్, ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో కొనసాగుతున్న లావాదేవీల బంద్



వర్తకులతో మాట్లాడుతున్న అధికారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో బెల్లం లావాదేవీల బంద్ కొనసాగుతున్నది. ఈనెల 18వ తేదీ నుంచి మార్కెట్‌లో లావాదేవీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కొలగార్లకు, వర్తకులకు తలెత్తిన సమస్యలతో లావాదేవీలు నిలిచిపోయాయి. ఏ రోజు కొలగారం ఆ రోజే చెల్లించాలని, బెల్లం దిమ్మలు చోరీకి గురైతే తమను బాధ్యులను చేయడం సరికాదంటూ కొలగార్లు పేర్కొంటున్నారు. సోమవారం కూడా లావాదేవీలు పునఃప్రారంభం కాకపోవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు వర్తకులతో సమావేశమయ్యారు. సమావేశంలో భాగంగా ఏ రోజు కొలగారం ఆ రోజు చెల్లించడానికి తమకు అభ్యంతరం లేదని వర్తకులు చెప్పినట్టు మార్కెట్ కమిటీ సెక్రటరీ శకుంతల తెలిపారు. బెల్లం దిమ్మలు పోతే బాధ్యత వహించకపోవడం సరికాదని చెబుతున్నారన్నారు. సీసీ కెమెరాలను యార్డుల్లో ఏర్పాటు చేసినా వైర్లు కట్ చేయడం వల్ల బెల్లం దిమ్మలు ఎవరు అపహరించుకుపోతున్నారో గుర్తించలేకపోతున్నామని ఆమె చెబుతున్నారు. బెల్లం దిమ్మలు పోయినట్టయితే తనకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నామన్నారు. వర్తకులు, కొలగార్లతో కూడా సమావేశమయ్యామని, ఈనెలాఖరు వరకు బెల్లం లావాదేవీలు కొనసాగించిన తరువాత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వర్తకులు చెబుతున్నారని ఆమె తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో వర్తకులు, కొలగార్లతో సమావేశమై చర్చించి సానుకూలంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సెక్రటరీ శకుంతల చెబుతున్నారు. వర్తకులతో జరిగిన సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, డిప్యూటీ డైరెక్టర్ వీరన్న, వర్తకులు పాల్గొన్నారని ఆమె తెలిపారు.

CLASSIFIEDS

ASTROLOGY

★ శ్రీ సాయిదుర్గ జ్యోతిష్యాలయం. 8 సం॥లుగా స్థిరంగా ఉన్నారు. స్త్రీ / పు ప్రేమ పెళ్ళి, వ్యాపారం, గ్రహదోష, వశీకరణ, ఎటువంటి సమస్యలకైనా 21 రోజులలో పరిష్కారం. SR మాల్ ప్రక్కన, కొత్త గాజువాక. సంప్ర॥ 7702201190
AJV_183363

CHANGE OF NAME
★ I, MD. GHOUSE MOHIUDIN (Old Name), S/o. Mohammed Sultan Mohiddin, resident of 10-133/16, F.No.501, Samata Res, Netaji park st., PF Colony, Chinnamusidivada, Penduthi, Visakhapatnam. Change my name from MD. GHOUSE MOHIUDIN (Old Name) to MOHAMMED GHOUSE MOHIDDIN (New Name) hence forth I am being called as MOHAMMED GHOUSE MOHIDDIN (New Name), S/o. Mohammed Sultan Mohiddin, for all purposes.
AJV_182883

CHANGE OF NAME
★ I, VADLAMANI LALITHA (Old Name), W/o. A S R K Sastry, resident of 50-19-6/A, 1st Floor, Radhika Mansion, TPT Colony, Visakhapatnam. Change my name from VADLAMANI LALITHA (Old Name) to AYALASOMAYAJULA LALITHA GAYATHRI (New Name) hence forth I am being called as AYALASOMAYAJULA LALITHA GAYATHRI (New Name), W/o. A S R K Sastry, for all purposes.
AJV_182884

CHANGE OF NAME
★ I, SHAIK BASEER (Old Name), S/o. Shaik Madaar, resident of 38-32-26, Dr. Zakeer Hussain Nagar, Marripalem, Visakhapatnam. Change my name from SHAIK BASEER (Old Name) to SHAIK BASHEER (New Name) hence forth I am being called as SHAIK BASHEER (New Name), S/o. Shaik Madaar, for all purposes.
AJV_182882

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

For Advertisement Contact :
9963231176, 9966165093

క్రైం... crime news

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

కశింకోట, ఏప్రిల్ 22: ఎలమంచిలి-నర్సింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు కింద పడి ఒక వ్యక్తి సోమ వారం మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. పల్లపు సోమవరం గ్రామానికి చెందిన తేటకాల దీపక్ (20) టైల్స్ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడని తెలిసిందన్నారు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం ఉందని, తమకు వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడన్నారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోను ఆధారంగా విచారణ చేయగా.. మృతుడి వివరాలు తెలిశాయని చెప్పా రు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి మృతి



జగన్ (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 22: స్థానిక ఇంటిగ్రేటెడ్ దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న మెషిన్ విద్యార్థి సప్ప జగన్(12)పై పడడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..

బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన సప్ప జగన్‌ను తల్లి మృతి చెందడంతో స్థానిక ఇంటిగ్రేటెడ్ దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో బంధువులు చేర్చారు. అప్పటి నుంచి ఇక్కడే విద్యాభ్యాసం చేస్తున్నాడు. జగన్ ప్రస్తుతం 6వ తరగతి చదువుకుంటున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం పాఠశాల ఆవరణలో చెప్పుల తయారీకి తెచ్చిన మెషిన్ చక్రం తిప్పగా అది జగన్ గుండెపై పడింది. వెంటనే ఆశ్రమ పాఠశాల సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించారు. వైద్య సేవలు అందిన తర్వాత అక్కడ చికిత్స చేసి జగన్‌ను పాఠశాలకు పంపించి వేశారు. అర్ధరాత్రి సమయంలో జగన్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కలగడంతో తిరిగి అనకాపల్లి తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. జగన్ తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు...

కశింకోట, ఏప్రిల్ 22: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎలమంచిలి పట్టణంలోని చినగొల్లలపాలెం వీధి చెందిన ముప్పల సన్యాసినాయుడు (43) కూలి పని నిమిత్తం విస్సన్నపేటకు ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్లి అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తుండగా ఆగ్రామ శివారున మలుపు వద్ద ప్రమాదవశాత్తు కింద పడిపోయాడన్నారు. ఈ ప్రమాదంలో సన్యాసినాయుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడన్నారు. ఈ మేరకు బావమరిది భరణికాన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వరహాపురంలో మరో విషాదం

» కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో భవన నిర్మాణ కార్మికుడు మృతి



పైడిరాజు (ఫైల్)

చీడికాడ/లంకెలపాలెం, ఏప్రిల్ 22: భవన నిర్మాణ పనులకు పట్టణానికి వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు శనివారం మృతిచెందగా, మరొకరు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు విడవడంతో మండలంలోని వరహాపురం కన్నీటి సంద్రంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలివి. వరహాపురం గ్రామానికి చెందిన తాటికొండ వెంకటరమణ (23), పోతు బంతి పైడిరాజు (32) శనివారం పరవాడ మండలం లంకెలపాలెం గ్రామం వద్ద గృహ నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లారు. అక్కడ నాలుగో అంతస్థు శ్లాబ్ కాంక్రీట్ వేసేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తుండగా అది కుప్పకూలిపోవడంతో ఇద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. తోటి కూలీలు స్థానికుల సాయంతో వీరిని తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళుతుండగా వెంకటరమణ మార్గ మధ్యలో ప్రాణాలు విడిచాడు. అలాగే, నాటి నుంచి పైడిరాజు కేజీహెచ్‌లో చావుబతుకుల మధ్య కొట్టిట్టాడుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మూడురోజుల్లో ఇద్దరు మృత్యువాత పడడాన్ని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు జీర్ణించుకో లేకపోతున్నారు. పోస్టుమార్టం అనంతరం పైడిరాజు మృతదేహాన్ని సాయంత్రానికి వరహాపురం తీసుకువచ్చారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆరుగురు మావోయిస్టులు లొంగుబాటు

» అందరూ దక్షిణ బస్తర్ డివిజన్‌కు చెందినవారే
» ఒక్కొక్కరిపై రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రివార్డు
» విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్నీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఐజీ

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బస్తర్ డివిజన్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రాంతంలో పని చేస్తున్న ఆరుగురు మావోయిస్టులు స్వచ్ఛందంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. చత్తీస్‌ఘడ్‌కు చెందిన వీరందరిపైనా రివార్డులు ఉన్నాయి. విశాఖలోని పాత జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్నీ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు, కిస్టారం ఏరియా కమిటీ సెక్రటరీ అయిన కుహరం మిథలేష్ అలియాస్ రాజు (37) పద్దెనిమిదేళ్లుగా అజ్ఞాతంలో ఉంటూ నాలుగు ఎదురుకాల్పులు, పోలీసులపై దాడి, మూడు హత్యలతో కలిపి 30కిపైగా ఘటనల్లో పాల్గొన్నాడని డీఐజీ వివరించారు. మిథిలేష్‌పై రూ.ఐదు లక్షలు రివార్డు ఉందన్నారు. అలాగే కిస్టారం ఏరియా కమిటీ సభ్యుడు బరసె మాసా (30) దాదాపు 20 ఘటనల్లో పాల్గొన్నాడని ఇతనిపై రూ.నాలుగు లక్షలు రివార్డు ఉందన్నారు. కొంట ఏరియా కమిటీ సభ్యుడైన వెట్టి భీమా (32) దాదాపు 25 ఘటనల్లో పాల్గొన్నాడని అతనిపై కూడా రూ.నాలుగు లక్షల రివార్డు ఉందన్నారు. కిస్టారం ఏరియా కమిటీ సభ్యురాలైన వంజమ్ రామే అలియాస్ కమల (28)పై రూ.నాలుగు లక్షలు రివార్డు ఉందని, ఆమె జనతన్ సర్కార్ కమిటీలో పనిచేస్తూ యువతను మావోయిస్టు పార్టీలోకి నియమించుకోవడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. కిస్టారం ఏరియా కమిటీ దళ సభ్యులైన మడకం సుక్కి (27), దూడి సోనీ (23)పై కూడా రూ. లక్ష చొప్పున రివార్డులు ఉన్నాయని డీఐజీ వివరించారు. వీరంతా మావోయిస్టు సిద్ధాంతాలపై విసుగు చెందడంతోపాటు, లొంగిపోయిన మావోయిస్టులకు ఏపీ ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహానికి ఆకర్షితులై జనజీవన స్రవంతిలో కలిసిపోవాలనే నిర్ణయానికి వచ్చి పోలీసుల ఎదుటకు వచ్చి స్వచ్ఛందంగా లొంగిపోయారన్నారు. వీరిపై చత్తీస్‌ఘడ్‌లో ఉన్న కేసులను తొలగించే విషయమై ఆ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. లొంగిపోయిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థికంగా దన్నుగా నిలవడానికి యత్నిస్తామన్నారు. ఏఓబీలో మావోయిస్టులు బలహీనమయ్యారని, గత మూడేళ్లలో 25 మంది లొంగిపోయారన్నారు. కీలకమైన మావోయిస్టులు లొంగిపోయారు కాబట్టి విశ్రాంతి తీసుకుంటామనుకునే ప్రసక్తే లేదని, ఇలాంటి తరుణంలో మరింత అప్రమత్తంగా ఉంటామన్నారు. ఏఓబీలో కీలకమైన మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

పాడేరు... తీరే వేరు

అన్ని రాజకీయ పార్టీలను ఆదరిస్తున్న నియోజకవర్గ ఓటర్లు

- 1967లో ఆవిర్భావం
- ఇప్పటివరకూ పన్నెండుసార్లు ఎన్నికలు
- ఐదుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు తెలుగుదేశం, రెండుసార్లు వైసీపీ విజయం
- బీఎస్పీ, జనతా పార్టీలు ఒక్కొక్కసారి జయ కేతనం
- ఒక్కసారి మినహా భగత తెగకు చెందిన వారే గెలుపు

(పాడేరు, ఆంధ్రజ్యోతి)

దశాబ్దాలుగా ఏజెన్సీకి, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేంద్రంగా ఉన్న పాడేరు ఓటర్లు అన్ని పార్టీలను ఆదరిస్తూ వస్తున్నారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం 1967 ఏర్పాటైంది. అప్పటినుంచి ఇప్పటివరకూ పన్నెండుసార్లు ఎన్నికలు జరగ్గా నాలుగుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, మూడుసార్లు టీడీపీ అభ్యర్థులు, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు, బీఎస్పీ, స్వతంత్ర, జనతా పార్టీ అభ్యర్థులు ఒక్కొక్కసారి గెలుపొందారు.




తమర్భ చిట్టినాయుడు


గిడ్డి అప్పలనాయుడు


కొట్టగుల్లి చిట్టినాయుడు


మత్స్యరాస బాలరాజు


మత్స్యరాస మణికుమారి


లకే రాజారావు


పసుపులేటి బాలరాజు


గిడ్డి ఈశ్వరి


కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

గతంలో గొలుగొండ నియోజకవర్గం పరిధిలో...

ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గంగా ఉన్న పాడేరు, గతంలో గొలుగొండ నియోజకవర్గ పరిధిలో ఉండేది. 1952లో పాడేరు, చింతపల్లి ప్రాంతాలు గొలుగొండ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేవి. కొన్నాళ్ల తర్వాత గూడెంకొత్తవీధి అసెంబ్లీ నియోజకవర్గంలో పాడేరు, చింతపల్లి ప్రాంతాలను కొనసాగించారు. 1962లో చింతపల్లిని ప్రత్యేకంగా నియోజకవర్గంగా విభజించి, పాడేరు ప్రాంతాన్ని అందులోనే ఉంచారు. 1967లో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఆ తరువాత కాలంలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలు కలిపి పాడేరు నియోజకవర్గంగా, జీకేవీధి, కొయ్యూరు, చింతపల్లి, నాతవరం, గొలుగొండ మండలాలు కలిపి చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేవి.

1967 నుంచి 2004 వరకూ నియోజకవర్గ పరిధిలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలు ఉండేవి. 2009లో పునర్విభజన తర్వాత పాడేరు నియోజకవర్గ పరిధిలో కొత్తగా చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలు వచ్చి చేరాయి. హుకుంపేట, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలు అరకులోయ నియోజకవర్గ పరిధిలోకి వెళ్లిపోయాయి. అప్పటికి నియోజక వర్గంలో సుమారు 1,94,000 మంది ఓటర్లు ఉండేవారు. కానీ ఆ తరువాత ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 2,44,925 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,18,154 మంది పురుషులు, మహిళలు 1,26,755 మంది, ఇతరులు 16 మంది ఉన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థినిగా పోటీ చేసిన గిడ్డి ఈశ్వరికి, వైసీపీ అభ్యర్థిగా ఉన్న విశ్వేశ్వరరాజుకు మధ్య ప్రధాన పోటీ జరిగే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో భగత తెగదే ఆధిపత్యం

పాడేరు నియోజకవర్గంలో 1967 నుంచి ఒక్కసారి (2009) మినహా 2019 వరకూ భగత తెగకు చెందినవారే ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. భగత తెగకు చెందిన ఓటర్లు అధిక సంఖ్యలో ఉండడం, ఇతర తెగలకు ఓటింగ్‌పై అవగాహన లేకపోవడం ఇందుకు కారణంగా చెబుతుంటారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009లో జరిగిన ఎన్నికల్లో మాత్రం అందుకు భిన్నమైన తీర్పు వచ్చింది. వాల్మీకి తెగకు చెందిన పసుపులేటి బాలరాజు (చింతపల్లి కేంద్రంగా ఉండే నియోజకవర్గం నుంచి అప్పటికే రెండుసార్లు గెలుపొందారు) గెలుపొందారు. 2009 ఎన్నికల నుంచి భగత, కొండదొర, కోందు, వాల్మీకి, కమ్మరతెగలకు చెందిన నేతలు రాజకీయంగా పోటీ పడుతున్నారు.

విజేతలు, మెజారిటీల వివరాలు

సం.	విజేత	పార్టీ	ఓట్లు	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు	విజేత మెజారిటీ
1967	తమర్భ చిట్టినాయుడు	కాంగ్రెస్	6,516	పి.రామారావు	ఇండి	4,018	2,516
1972	తమర్భ చిట్టినాయుడు	కాంగ్రెస్	8074	ఆర్‌పీ పడాల్	ఇండి	5,641	2,433
1978	గిడ్డి అప్పలనాయుడు	జనతా	12,653	తమర్భ చిట్టినాయుడు	కాంగ్రెస్	10,146	2,507
1983	తమర్భ చిట్టినాయుడు	కాంగ్రెస్	8,810	శెట్టి లక్ష్మణుడు	ఇండి	6,342	2,568
1985	కొట్టగుల్లి చిట్టినాయుడు	టీడీపీ	11,342	మత్స్యరాస బాలరాజు	కాంగ్రెస్	11,229	113
1989	మత్స్యరాస బాలరాజు	కాంగ్రెస్	27,501	మత్స్యరాస వెంకటరాజు	టీడీపీ	13,037	14,464
1994	కొట్టగుల్లి చిట్టినాయుడు	టీడీపీ	27,923	మత్స్యరాస బాలరాజు	కాంగ్రెస్	15,685	12,238
1999	మత్స్యరాస మణికుమారి	టీడీపీ	26,160	లకే రాజారావు	బీఎస్‌పీ	21,734	4,426
2004	లకే రాజారావు	బీఎస్‌పీ	33,890	ఎస్.రవిశంకర్	ఇండి	26,335	7,555
2009	పసుపులేటి బాలరాజు	కాంగ్రెస్	35,653	జి.దేముడు	సీపీఐ	35,066	587
2014	గిడ్డి ఈశ్వరి	వైసీపీ	52,384	జి.దేముడు	సీపీఐ	26,243	26,141
2019	కొట్టగుల్లి భాగ్యలక్ష్మి	వైసీపీ	71,153	గిడ్డి ఈశ్వరి	టీడీపీ	26,349	42,804

పాడేరు నుంచి ముగ్గురు మంత్రులు

పాడేరు నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన ముగ్గురు మంత్రులుగా పనిచేశారు. 1989లో ఎమ్మెల్యేగా గెలుపొందిన మత్స్యరాస బాలరాజు (కాంగ్రెస్) అప్పట్లో రాష్ట్ర స్టేషనరీ, ఉద్యానవన శాఖా మంత్రిగా పనిచేశారు. అలాగే 1999లో ఎమ్మెల్యే అయిన మత్స్యరాస మణి కుమారి (టీడీపీ)... చంద్రబాబునాయుడు క్యాబినెట్‌లో గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగా చేశారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందిన పసుపులేటి బాలరాజు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య కిరణ్‌కుమార్‌రెడ్డిల క్యాబినెట్‌లలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగా పనిచేశారు.

2009లో మారిన నియోజకవర్గం స్వరూపం....

2009లో ఏజెన్సీ ప్రాంతంలోని అసెంబ్లీ నియోజకవర్గాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. పునర్విభజన వల్ల పాడేరు అసెంబ్లీ స్థానంలోకి పాడేరు, జి.మాడుగుల, జీకేవీధి, కొయ్యూరు మండలాలు, అరకులోయ అసెంబ్లీ స్థానంలోకి అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలు వచ్చాయి. దీంతో నియోజకవర్గంలో పూర్తిగా గిరిజన మండలాలే ఉన్నాయి.

ఓటరు మాట

అభివృద్ధిని కాంక్షించే వారికే ఓటు



నియోజకవర్గం అభివృద్ధికోసం ఆలోచించే అభ్యర్థులను ఎన్ను కుందాం. లోక్‌సభ, శాసనసభ అభ్యర్థులుగా పోటీ చేసేవారిలో విద్యార్హత, సమర్థత, సేవాభావం ఉన్నవారిని గెలిపించుకుంటే న్యాయం జరుగుతుంది. ప్రజా సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కారానికి కృషిచేయగలగాలి. స్వలాభం కోసం తాయిలాలు, ప్రలోభాలతో ఓటర్లను మభ్య పెట్టేవారిని ఓటుతో తిరస్కరించాలి.

\- కుచ్చెర్లపాటి చంద్రశేఖరరాజు, వ్యాపారవేత్త, మధురవాడ

ప్రగతి కోసం కృషి చేయాలి



విద్య, వైద్య పారిశ్రామిక రంగాల అభివృద్ధికి పాటుపడే సామర్థ్యం ఉన్న నేతలకు ఓటు వేయాలి. నియోజకవర్గం, రాష్ట్రం ప్రగతి కోసం తపించే వారిని ఎన్నుకుంటే మేలు జరుగుతుంది. ఆలోచించి ఓటు వేయాలి. సేవాస్ఫూర్తి, జాతీయ భావం ఉన్న వారిని చట్టసభలకు ఎన్నుకుంటే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. ప్రలోభాలకు లొంగకుండా ఓటువేసి సమాజ ప్రగతి బాటలు వేయాలి.

\- డాక్టర్ యూవీఎస్ఎస్ శాస్త్రి, అధ్యాపకులు, ఎంవీపీ కాలనీ

ఆదర్శ నేత అవసరం



ఆదర్శ నాయకుడ్ని ఓటర్లు ఎన్నుకోవాలి. కుల, మత, ఇతర ప్రలోభాలకు లొంగిపోయి మంచి ప్రభుత్వం కావాలనుకోవడం స్వార్థమే. ఎలాంటి పాలకులు కావాలో నిర్ణయించే అధికారం ఓటర్ల చేతుల్లో ఉంది. మంచివారికి ఓటువేస్తే కోరుకున్న ప్రభుత్వం వస్తుంది.

\- పద్మావతి రాంభక్త, రచయిత్రి, రామ్‌నగర్

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొద లయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుం టున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ చర్యలు
- పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు
- ప్రత్యేక వాహనాలతో కేంద్రాలకు తరలింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 85 ఏళ్లు నిండిన వృద్ధులు ఇళ్ల నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ఓటు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వరకు సహకారాన్ని అందించనుంది. వీరిని దృష్టిలో ఉంచుకుని పోలింగ్‌స్టేషన్లను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగులకు స్నేహపూర్వక సౌకర్యాలు హామీ కింద ర్యాంప్‌లు, హ్యాండ్ రైలింగ్ ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్‌స్టేషన్‌కు తరలించేందుకు రవాణా సదుపాయాలు కల్పించనున్నారు. ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులకు సహాయకులను ఏర్పాటు చేస్తారు. అంధుల కోసం బ్రెయిలీ ఓటరు సమాచార స్లిప్‌లు అందిస్తారు. బ్రెయిలీలో డమ్మీ బ్యాలెట్ షీట్లు అందుబాటులో ఉంచనున్నారు. దృష్టి మాంద్యం ఉన్న వారికోసం బూతద్దాలు, షీట్లు ఏర్పాటు చేస్తారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు (85 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారు) ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని పొందవచ్చు. ఇందుకు ఫారం-12 డి ఉపయోగించాల్సి ఉంటుంది. దీని ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం లభిస్తుంది.

దరఖాస్తుకు ఇవ్వాల్సినవి.. : పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని 85 ఏళ్లు దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేస్తోంది. పోస్టల్ బ్యాలెట్ పేపర్ ద్వారా సాధారణ ఎన్నికల తేదీకి ముందు ఓటింగ్ జరుగుతుంది. బ్యాలెట్ పూర్తి గోప్యతతో నిర్వహించనున్నారు. బ్యాలెట్ పేపర్ రిటర్నింగ్ అధికారికి పంపించేందుకు డబుల్ ఎన్వలప్‌లో సీల్ చేస్తారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఫారం-12 డి లోని దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. దీంతో పాటు దివ్యాంగుల అంగ వైకల్యాన్ని ధ్రువీకరించే పత్రాలు జతచేయాలి. సీనియర్ సిటిజన్లు ఫారం 12డి సమర్పిస్తే సరిపోతుంది.




ఓటింగ్ ఇలా .. : వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఆరు స్టెప్‌ల్లో ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే ప్రక్రియ పూర్తి అవుతుంది. స్టెప్-1లో రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించిన ఈ విధానానికి అర్హులైన ఓటర్ల ఇళ్లను బీఎల్‌వో సందర్శిస్తారు. బీఎల్‌వో, రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించిన వివరాల ప్రకారం ఫారం-12డిని ఓటరుకు అందించి రశీదు పొందుతారు. స్టెప్-2లో భాగంగా నోటిఫికేషన్ వచ్చిన ఐదురోజుల్లో ఓటరు నుంచి 12డి ఫారంను బీఎల్‌వో సేకరించి రిటర్నింగ్ అధికారికి అందిస్తారు. స్టెప్-3లో ఫారం-12డిలో సరైన వివరాలున్న ఓటర్లందరికీ పోస్టల్ బ్యాలెట్ పేపర్ జారీచేస్తారు. సూక్ష్మ పరిశీలకులతోపాటు పోలింగ్ అధికారుల బృందం ఫారం-12 డి దరఖాస్తులో పేర్కొన్న చిరునామా వద్ద ఓటర్లను సందర్శిస్తుంది. స్టెప్-4లో ఓటర్ల గుర్తింపును ధ్రువీకరిస్తారు. ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. ఓటరు తన ఓటును వినియోగించుకుని బ్యాలెట్‌ను ఒక చిన్న కవర్‌లో ఉంచుతారు. స్టెప్-5లో గుర్తింపు పొందిన బ్యాలెట్ పేపర్ కవర్‌తోపాటు అధీకృత ఎన్నికల అధికారి ధ్రువీకరించిన ఫారం-13ఏలో సక్రమంగా నింపిన, సంతకం చేసిన డిక్లరేషన్‌ను పెద్ద ఎన్వలప్ (ఫారం-13సి) లోపల ఉంచుతారు. స్టెప్-6లో పెద్ద కవరును మూసివేసి ఎన్నికల అధికారికి అందిస్తారు.

16 మంది అభ్యర్థులు దాటితే రెండో బ్యాలెట్ యూనిట్

అదనపు యూనిట్లకు అధికారుల అన్వేషణ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రానున్న సార్వ త్రిక ఎన్నికల్లో ఒక స్థానం నుంచి 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశాలపై అధికారులు అంచనావేస్తున్నారు. ఒకవేళ పార్లమెంటు/అసెంబ్లీ స్థానం నుంచి 16మంది కంటే ఎక్కువమంది బరిలో ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించడం తప్పనిసరి. ఈ నేప థ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయింది. సాధారణం గా బ్యాలెట్ యూనిట్‌లో 16 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉండేలా యంత్రాన్ని రూపొందించారు. అంత కంటే ఎక్కువమంది పోటీలో ఉంటే రెండో యూనిట్ ఏర్పా టుచేయాలి. ప్రస్తుతం విశాఖ లోక్‌సభ నియోజకవర్గానికి శనివారం వరకు 11 మంది నామినేషన్లు దాఖలుచేశారు. ఇం కా వైసీపీ, టీడీపీ, వామపక్షాలు, కాంగ్రెస్ అభ్యర్థులు నామినే షన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఈనెల 25వ తేదీ ఆఖరు రోజు. అప్పటికి 16మంది కంటే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని భావి స్తున్నారు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 30 తరువాత బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి గుర్తుల కేటాయింపు పూర్తవుతుంది. వాటిని బ్యాలెట్ యూనిట్‌లకు లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ విశాఖ లోక్‌సభకు 16మంది మాత్రమే ఉంటే ఒక యూనిట్ సరిపోతుంది. అంతకంటే ఎక్కువగా ఉంటే రెండో యూనిట్ అవసరమవుతుంది. లోక్‌సభ పరిధిలో 1,991 పోలింగ్ కేంద్రాలున్నందున ప్రతి కేంద్రానికి ఒక బ్యాలెట్ యూనిట్ ఉంటుంది. బరిలో అభ్యర్థుల సంఖ్య 16కు మించి ఉంటే మరో 1,991 బ్యాలెట్ యూనిట్లు కావాలి. అసెంబ్లీ సెగ్మెంట్‌కు కూడా 16 మందికి మించితే రెండో యూనిట్ అవసరం. జిల్లాలోని భీమిలి నియోజకవర్గంలో 350 వరకు బూత్‌లున్నందున ఇప్పటికే అదనపు యూనిట్లు అవసరమని తేల్చారు. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల్లో అదనంగా ఉన్న యూనిట్లు ఇక్కడికి పంపాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నారు. అంతేకాకుండా తొలి విడత ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో వినియోగించని యూనిట్లను కూడా రప్పించే ప్రయత్నంలో ఉన్నారు. ముందుగానే అదనపు యూనిట్లు సిద్ధం చేసుకుంటే మంచిదనే భావనలో అధికారులున్నారు. కాగా ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒకటి చొప్పున వీవీ ప్యాట్లు సరిపోతాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



నాడు గ్రామాభ్యుదయం నేడు వ్యక్తిగతం...

- డబ్బున్నవారు, చదువుకున్నవారు సైతం ఓటు కోసం చేయిచాచడం శోచనీయం
- రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం తగ్గాలి
- బీజేపీ సీనియర్ నాయకులు ఏఆర్‌జీ శర్మ


ఏఆర్‌జీ శర్మ

అన్నాపంతుల రామగోపాలశర్మ (ఏఆర్‌జీ శర్మ)... బీజేపీ శర్మగా పేరొందిన ఆయన 2010 నుంచి 2013 వరకూ ఉమ్మడి జిల్లా బీజేపీ అధ్యక్షులుగా పనిచేశారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీలలో సైతం పలు పదవులు నిర్వహించారు. సీనియర్ నాయకులు పీవీ చలపతిరావు, బండారు దత్తాత్రేయ, బంగారు లక్ష్మణ్, తదితరులతో కలిసి పనిచేశారు. 1975లో ఎమర్జన్సీ సమయంలో ఎనిమిది నెలల పాటు జైలులో ఉన్నారు. శర్మ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి జనసంఘ్ (ప్రస్తుతం బీజేపీ)లో చేరారు. శర్మ చోడవరానికి చెందినవారు. ప్రస్తుతం ఎనిమిది పదుల వయసులో ఉన్న ఏఆర్‌జీ శర్మ నాటికి, నేటికీ రాజకీయాల్లో, ప్రజల్లో వచ్చిన మార్పులపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన తన మాటల్లోనే..

ఒకప్పుడు ఎన్నికల సందర్భంగా గ్రామాల్లోకి వెళ్లిన నాయకులను మా గ్రామానికి ఏం చేస్తారని అడిగే పరిస్థితి. ఇప్పుడు గ్రామాల్లోకి వెళితే నాకేమి ఇస్తున్నావు అని అడిగే దుస్థితి. నాలుగు దశాబ్దాల నుంచి పల్లెల్లో రాజకీయ వాతావరణం కలుషితం కావడం ప్రారంభమైంది. ఒకప్పుడంతా సమిష్టితత్వం. ఇప్పుడంతా వ్యక్తిగతంగా ఎన్నికల వాతావరణం మారిపోయింది.

చదువుకున్నవారు, ఎంతో కొంత ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది లేని ధనవంతులు సైతం ఇప్పుడు ఓటు కోసం చేతులు చాస్తుండడం చూస్తుంటే బాధగా అనిపిస్తున్నది. నాడు ఎన్నికల సందర్భంగా గ్రామాలకు ప్రచారం కోసం వెళితే ఒక్క రూపాయి కూడా ఖర్చయ్యేది కాదు. ఎవరికి వారు స్వచ్ఛందంగా కదలివచ్చి ప్రచారంలో పాల్గొనేవారు. నేడు కార్యకర్తలకు సైతం వాహనాలు సమకూర్చితే తప్ప ప్రచారానికి కదలడం లేదు.

నాడు ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామాల్లో అడుగుపెడితే, నాయకులు చెప్పేది గ్రామస్థులంతా శ్రద్ధగా విని, తమ గ్రామానికి అవసరమైన పని ఏదో సూచించి ఆ పనిచేయాలని అడిగేవారు. ఇప్పుడు గ్రామం గురించి కానీ గ్రామం అభివృద్ధి గురించి కానీ పట్టించుకున్న వాళ్లు కరువయ్యారు. వ్యక్తిగత కోర్కెలు కోరడం ఎక్కువైంది. నాడు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారంతా ఒక నిబద్ధతతో ప్రజలకు ఏదో సేవ చేయాలన్న ఉద్దేశంతో ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేవలం డబ్బులతోనే రాజకీయం ముడిపడి ఉంది. దీని వల్ల రాజకీయాల్లో అవినీతి, డబ్బు ప్రవాహం పెరిగిపోయింది. ఎన్నుకున్న నేతను కూడా ఓటర్లు గట్టిగా ప్రశ్నించే పరిస్థితి లేకపోవడానికి కూడా ఈ డబ్బే కారణం. డబ్బుతో రాజకీయాలు చేసి తిరిగి డబ్బు సంపాదనలో మునిగే నేతలు తప్ప, ప్రజాసమస్యల పరిష్కారం కోసం కానీ, ప్రజల కోసం పనిచేసే నాయకులు కరువయ్యారు. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం తగ్గాలి. ఈ పరిస్థితిలో మార్పు రావడానికి నేటి యువతరం బాధ్యత తీసుకోవాలి. లేదంటే రాజకీయాలు మరింత దిగజారిపోవడం ఖాయంగా కనపడుతున్నది.

● చోడవరం

మునిసిపల్ చైర్మన్ నుంచి ఎమ్మెల్యే

భీమిలి మొదటి ఎమ్మెల్యే నాయుడు ప్రస్థానం


కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు భీమిలి మొదటి ఎమ్మెల్యే

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత మొదటిసారి జరిగిన ఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యేగా కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు ఎన్నికయ్యారు. ఈయన ఎన్నిక, పదవీ కాలం పెంపుదల వంటి అనేక అంశాలను బేరీజు వేసుకుంటే కొంతమందికి పదవులు అనుకోని అవకాశంగా లభిస్తాయనిపిస్తుది. భీమిలి మునిసిపల్ చైర్మన్‌గా ఉత్తమ సేవలందించిన వ్యక్తిగా సూర్యనారాయణనాయుడు గుర్తింపు పొందారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది. ఆ సమయంలో భీమిలి నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలుండాలన్న ప్రతిపాదన ఉంది. ఆ సమయంలో నాయుడుకు టికెట్ లభించడం, సింగిల్ ఎమ్మెల్యే నియోజకవర్గంగా ప్రకటించడం ఆయనకు కలిసివచ్చిన అంశం.



భీమిలి చిన్నబజారులో కలిగొట్ల సూర్యనారాయణ పేరుతో మార్కెట్

మొదటి ఎన్నికల సమయానికి విజయనగరం జిల్లా లేదు. దీంతో ప్రస్తుతం ఆ జిల్లా పరిధిలోని అలమండ, జామి, భోగాపురం తదితర ప్రాంతాలు భీమిలి నియోజకవర్గంలో ఉండేవి. రాష్ట్రంలో మొత్తం 167 నియోజకవర్గాలుండగా 29 నియోజకవర్గాలలో ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలు ఉండేవారు. రిజర్వేషన్లు లేకపోవడంతో సాధారణ, రిజర్వుడు అభ్యర్థులు పోటీ చేసేవారు. అయితే భీమిలిలో కొంతమంది ఎస్సీలు ఉన్నందున రెండో ఎమ్మెల్యే ప్రతిపాదన వచ్చింది. కానీ నాటి లెక్కల ప్రకారం భీమిలి కన్నా ఎక్కువమంది ఎస్సీలున్న నియోజకవర్గాలు ఉన్నందున సింగిల్ ఎమ్మెల్యే నియోజకవర్గంగా గుర్తించారు. ఈ ఎన్నికల్లో పోటీకి గొర్రిపోటు అప్పారావు, కొమ్మూరు అప్పడుదొర వంటి వారు సిద్ధమయ్యారు. అయితే స్థానికుడ్ని అభ్యర్థిగా ఎంపిక చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించడంతో కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు టికెట్ ఆశించారు. కానీ ఆ పార్టీ జీవీకే వల్లభరావువైపు మొగ్గు చూపింది. దీంతో స్థానికులు నాయుడుపై ఒత్తిడి తెచ్చారు. స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీకి నాయుడు మొదట వెనుకంజ వేసినా భీమిలి వాసుల ఒత్తిడి మేరకు రంగంలోకి దిగి విజయం సాధించారు.

అభివృద్ధి పనులే గెలిపించాయి

మునిసిపల్ చైర్మన్‌గా నాయుడు చేసిన పనులే ఆయన విజయానికి కారణమయ్యాయని స్థానికులు చెబుతుంటారు. భీమిలి పరిధిలో రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు నిర్మించడం, నియోజకవర్గమంతా అభివృద్ధి పనులు చేపడతానని హామీ అతని విజయానికి సహకరించాయంటారు. మొదటి అసెంబ్లీ ఎన్నికలు 1952 ఫిబ్రవరిలో జరిగాయి అప్పటి నుంచి 1957 వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన నాయుడు కాలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఇప్పటికీ భీమిలిలో కనిపిస్తుంటాయి.

వారసుల సేవలు

భీమిలి అభివృద్ధికి కృషిచేసిన నాయుడుకు స్థానికంగా తగిన గుర్తింపు లభించింది. చిన్నబజారులో కూగాయల మార్కెట్‌కు సూర్యనారాయణనాయుడు పేరును పెట్టారు. వీరి కుమారుడు కలిగొట్ల భాస్కరరావు భీమిలి మునిసిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఇతని మనుమల్లో శ్రీరామచంద్రమూర్తి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించడమే కాకుండా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

● భీమునిపట్నం రూరల్

పెందుర్తిలో మహిళలే మహారాణులు

● శాసనసభ ఎన్నికల్లో అతివల ఓట్లే కీలకం



పెందుర్తి శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల విజయాన్ని నిర్దేశించేది మహిళా ఓటర్లే. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది ఉండడం, ఓటింగ్‌లోనూ వారే భారీగా పాల్గొంటుండడం విశేషం. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,01,457 కాగా, ఇందులో పురుషులు ఓటర్లు 149,615, మహిళలు 151,837 మంది ఉన్నారు. మొత్తంగా పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 2,222 ఎక్కువగా ఉంది. పెందుర్తి మండలంలో 468, సబ్బవరంలో 1,231, పరవాడ మండలంలో 661 మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్నారు. అంతేకాకుండా పోలింగ్‌లో బారులుతీరి నిల్చొని మరీ ఓటు వేసే వారి సంఖ్య పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా నమోదవుతోంది. ఇప్పటివరకు జరిగిన ఎన్నకల్లోనూ ఈ విషయం రుజువయింది. ఈ నేపథ్యంలో ఇక్కడ రంగంలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని వారే నిర్దేశించనున్నారు. ● పెందుర్తి

కొంగు చాపి అడుగుతున్నా.. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించండి

» పేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత


తనను గెలిపించాలని కొంగుచాపి అడుగుతున్న అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 22: నా కుటుంబం పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల రుణం ఈ జన్మకు తీర్చుకోలేనిదని, మీ ఇంటి ఆడబిడ్డగా కొంగు చాపి అడుగుతున్నా..ఈ ఎన్నికల్లో గెలిపించాలని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. సోమవారం నక్కపల్లిలో జరిగిన నియోజకవర్గ ఎన్డీఏ కూటమి సభలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలందరినీ మీ ఇంటి ఆడపడుచుగా అడుగుతున్నానన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా క్షీణించిందని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే లక్ష్యంగా పాలన సాగించారన్నారు. ఈ సందర్భంగా తన కుమారుడు, కుమార్తెను కూడా వేదికపై నుంచి ప్రజలకు పరిచయం చేశారు. జనసేన నేత గెడ్డం బుజ్జి మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటర్లంతా బటన్ నొక్కి.. రాక్షస పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

అట్టహాసంగా అనిత నామినేషన్

పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా వంగలపూడి అనిత సోమవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత టీడీపీ నాయకులతో కలిసి ఆమె ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. అనంతరం ముహూర్తం ప్రకారం ఆలయంలోనే నామినేషన్ల పత్రాలపై అనిత సంతకం చేశారు. తర్వాత సారిపల్లి వానిపాలెం హైవేకు ఆనుకుని వున్న తన నివాసానికి చేరుకున్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల నుంచి వేల సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు. అనిత నామినేషన్‌కు ముఖ్యఅతిథిగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో సహా తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్దకు ర్యాలీగా వెళ్లారు. సీఎం రమేశ్, జనసేన నేత గెడ్డం బుజ్జి, ఎస్.రాయవరం మాజీ ఎంపీపీ ఏజర్ల వినోద్‌రాజులతో కలిసి ఆర్వో కె.గీతాంజలికి అనిత ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి బాటలో నడిపిస్తా..

జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్


జనసేనలో చేరిన ఎలమంచిలి 8వ వార్డు కౌన్సిలర్ భర్త చిరంజీవి

రాంబిల్లి, ఏప్రిల్ 22 : వచ్చే ఎన్నికల్లో నాకు ఒక అవకాశం ఇస్తే గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తా నని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం ఆయన కూటమి నేతలతో కలిసి మండలంలోని వెంకటాపురం, హరిపురం, పంచదార్ల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనలో సంక్షేమం అంటూ పది రూపాయలు జేబులో పెట్టి వంద రూపాయలు కొట్టేశారని విమర్శించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎలమంచిలి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు గాజుగ్లాసు గుర్తుపైన, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజయకుమార్ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విజయకుమార్‌కు గ్రామాల్లో మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ధూళి రంగనాయకులు, వి.దినబాబు, పప్పల నూకన్న దొర, బైలపూడి శ్రీరామదాసు, జనప రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ 8వ వార్డు కౌన్సిలర్ భర్త

ఎలమంచిలి మున్సిపాలిటీ 8వ వార్డు వైసీపీ కౌన్సిలర్ సాయి ప్రసన్న భర్త చిరంజీవి సోమవారం తన అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. మండలంలోని హరిపురం పార్టీ కార్యాలయంలో చిరంజీవికి నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎలమంచిలి మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా గాలికి వదిలేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయకుమార్ విజయానికి పనిచేస్తానన్నారు.

త్రిమూర్తుల ద్వయంతో ఏపీ హ్యాపీ

జనసేన పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఏప్రిల్ 22: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సుస్థిరత ఏర్పడుతుందని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇక్కడి కోటనరవలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిమూర్తుల్లాంటి మోదీ, చంద్రబాబు, పవన్ ద్వయానికి పట్టం కడితే ఏపీ హ్యాపీగా ఉంటుందన్నారు. ప్యాలెస్ లో కూర్చుని బటన్ నొక్కి తాయిలాలు ఇచ్చేస్తే ఓట్లు పడతాయనుకోవడం అవివేకమన్నారు. అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై, తనకు గాజు గ్లాసుపై ఓటు వేసి గెలిపించాలని విస్తృత ప్రచారం చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.


ఉక్కు పరిరక్షణమే మా ధ్యేయం: 'పంచకర్ల'

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని జనసేన 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ప్లాంట్ టౌన్‌షిప్‌లో జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ఉక్కు అంశంపై వైసీపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందని, కూటమి విజయంతోనే ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు.

కూటమి విజయంతో రాష్ట్రానికి ఉజ్వల భవిత

పరవాడ : కూటమి విజయంతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉందని పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కోరారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీ పరిధి గ్రామాల్లో సోమవారం రాత్రి ఆయన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు ఆయనకు హారతులతో నీరాజనం పలికారు.





కంబాల జోగులు నామినేషన్ దాఖలు

నక్కపల్లి, ఏప్రిల్ 22: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి సోమవారం వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు నామినేషన్ పత్రాలను ఆర్వో గీతాంజలికి అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవయసాయల సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎస్.రాయవరం మండలం నేత బొలిశెట్టి గోవింద్ వున్నారు.

సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 22 : అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సీఎం రమేశ్‌కు మద్దతుగా టీడీపీ శ్రేణులు కదలిరావాలని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న జరగబోయే సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమాన్ని చూసి వైసీపీలో వణుకు పుట్టించాలన్నారు.కార్యక్రమంలో నాయకులు ధూళి రంగనాయకులు, ఇత్తంశెట్టి రాజు, నానాజి, కొలుకులూరి విజయబాబు, డ్రీమ్స్ నాయుడు, భీమవరం శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బండారును సత్కరించిన రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22: టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సోమవారం సత్యనారాయణమూర్తి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న రత్నాకర్ ఆయన్ను సత్కరించారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విజయకేతనం


ఎం.వరుణ్‌సందేశ్ జీవీఎంసీ స్కూల్ (587/600)


పి.దివ్య, తానాం గురుకులం, 586/600


బి. మొన్నిత జడ్పీహెచ్ఎస్ 583/600


ఎస్. లేఖ్య, భవానీ నికేతన్ 591/100


సాహితి శివాని జడ్పీహెచ్ఎస్ 584/100


చంద్రిక, గాయత్రీ స్కూల్ 570/600


చాందిని రవీంద్ర స్కూల్ 589/600


యల్లపు రిషిత్ జడ్పీహెచ్ఎస్ 572/600


కేడీఎస్‌పీ ప్రసాద్ ప్రభుత్వ పాఠశాల 579/600


పి జగదీశ్, జడ్పీహెచ్ఎస్, 581/600

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. అనకాపల్లి జీవీఎంసీ ఆరు ఉన్నత పాఠశాల్లో 80 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో పది పరీక్షలకు 152 మంది విద్యార్థినులు హాజరుకాగా 134 మంది పాసై 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈస్కూల్‌లో కరణం సంజనా 588 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. జానా లహరి 582, కె.నవ్య 576 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. మెయిన్‌రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 64 మంది ఉత్తీర్ణత సాధించారు. గవరపాలెం ఉన్నత పాఠశాలలో 83 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 66 మంది ఉత్తీర్ణత సాధించారు.గాంధీనగరం ఉన్నత పాఠశాలలో 119 మందికి 94 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ ఎం.వరుణ్‌సందేశ్ 587, డి. గణేష్ 577, ఎస్.పవన్‌శ్రీ 568 మార్కులు దక్కించుకుని టాపర్లుగా నిలిచారు. భీమునిగుమ్మంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్‌లో పరీక్ష రాసిన 12 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో 57 మందికి 52 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఈ స్కూల్‌లో ఎం.సత్యవాణి 572 మార్కులు, ఎం. ప్రవల్లిక 569 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు.

ప్రశాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

స్థానిక ప్రశాంతినికేతన్ ఎంవీవీఎస్ మూర్తి ఇంగ్లీష మీడియం స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో చక్కని ప్రతిభను కనబరిచారు. ఈ పరీక్షల్లో స్కూల్ విద్యార్థినీ కె.వర్షిణి 588/600 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. 92 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా 89 మంది ఉత్తీర్ణత సాధించారని కరస్పాండెంట్ డీవీ శ్రీనివాసరావు, డి.చంద్రశేఖర్ తెలిపారు.

తేగాడ కేజీబీవీలో 90శాతం

కశింకోట: మండలంలోని తేగాడ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డి. చంద్రకళ తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గొలగాని రమ్య 547, డి.అంజలి 532, బి.సౌజన్యప్రియ 530 మార్కులు సాధించారని చెప్పారు. కేజీబీవీ నుంచి 40 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా.. 36 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

కొండకొప్పాక పాఠశాలలో 105 మంది..

అనకాపల్లి రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కొండకొప్పాక జడ్పీ హైస్కూల్‌లో 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి 122 మంది పరీక్షలకు హాజరుకాగా 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 572 మార్కులతో నందారపు వినయ్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా, 550 మార్కులు బి. చరిత రెండో స్థానంలో నిలిచింది. వీరిని ఉపాధ్యాయులను అభినందించారు.

పరవాడలో 89.47 శాతం

పరవాడ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 89.47 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవోలు ఎం.దివాకర్ రావు, జి.సాయిశైలజా తెలిపారు. మొత్తం 836 మంది పరీక్షలు రాయగా 748 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వాడచీపురుపల్లి హైస్కూల్‌కు చెందిన డి.రఘు 588 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. తానాం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పి.దివ్య 586 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. పరవాడ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.జయవర్ధన్ 583 మార్కులతో తృతీయస్థానంలో నిలిచారు. తానాం గురుకుల పాఠశాలకు చెందిన చైతన్య 581 మార్కులతో నాల్గో స్థానంలో నిలిచింది.

సబ్బవరంలో 81 శాతం

సబ్బవరం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పదో తరగతిలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం బాలికలు శతశాతం ఫలితాలు సాధించారు. కేజీబీవీలో 38 మంది బాలికలు పరీక్షలు రాయగా 38 మంది ఉతీర్ణులయ్యారు. ఎల్. మౌనీష 569, టి.పూజితకు 538 మార్కులు సాధించారు. తవ్వవానిపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 27 మంది పరీక్షలకు హాజరవగా 24 మంది ఉత్తీర్ణులయ్యారు. అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు 70 మంది పరీక్షలకు హాజరు కాగా 58 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 96 మంది పరీక్షలు రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. మలునాయుడుపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 56కి 40 మంది ఉత్తీర్ణలయ్యారు. రావలమ్మపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 81కి 62 మంది ఉత్తీర్ణులయ్యారు. సబ్బవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 84 మంది పరీక్షలు రాయగా 73 మంది ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా భీశెట్టి మొన్నిత 583, గుంపాన భాగ్యశ్రీ 563, యండవ తీనా 554 మార్కులు సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి అభినందనలు తెలిపారు.

రాంబిల్లిలో 92.35 శాతం

రాంబిల్లి: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 92.35 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో ఎం.సూర్యారావు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ 14 పాఠశాలలకు చెందిన 536 మంది పది పరీక్షలు రాయగా.. వీరిలో 495 మంది విద్యార్థులు పాసయ్యారన్నారు. వీరిలో మండల స్థాయిలో రాంబిల్లి రవీంద్ర హైస్కూల్‌కు చెందిన గనగళ్ల చాందిని 589 మార్కులు సాధించి ప్రథమ స్థానంలోను, లోటర్ ఇఎన్ హైస్కూల్‌కు చెందిన సిరసపల్లి దుర్గ 588 మార్కులతో రెండోవ స్థానంలోను, దిమిలి హైస్కూల్‌కు చెందిన తేలు తేజశ్విని 562 మార్కులతో మూడో స్థానంలో నిలిచిందన్నారు.

అచ్యుతాపురంలో 86.89 శాతం

అచ్యుతాపురం రూరల్ : మండలంలో పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 86.89 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో దేవరాయల్ తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో ఎన్.ఝాన్సీ (579), వి.నికిత (574), కె.ధనశ్రీ (571) సాధించారని, అచ్యుతాపురం హైస్కూల్ విద్యార్థిని యన్నంశెట్టి సాహితీ శివాని (584), హరిపాలెం హైస్కూల్‌లో మారిశెట్టి చరణ్(544) మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల టాపర్‌లుగా నిలిచారు. భవానీ విద్యానికేతన్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించగా, ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థిని సీరపు లేఖ్య 591 మార్కులు సాధించిందన్నారు. గాయత్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కె.చంద్రిక (570), జి.మౌనిక (570) ఉత్తీర్ణత సాధించగా, రవీంద్ర స్కూల్‌కు చెందిన జి.చాందిని (589), జి.భార్గవి (570), ఆర్.లక్షిత (584), ఎం.రమ్య (570) ఉత్తమ మార్కులు సాధించినట్టు తెలిపారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ


తనుశ్రీని అభినందిస్తున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. వీరిలో ఆడారి తనుశ్రీ 595/600, యల్లపు షణ్ముఖప్రియ 592/600, కుక్కా యామినిజ్యోతిక 589/600 మార్కులు సాధించి సత్తా చాటారు. సోమవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ.. టెన్త్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 225 మంది విద్యార్థుల్లో 135 మంది 500లకు పైగా మార్కులు, 62 మంది 550కిపైగా మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

కోటవురట్లలో 86 శాతం

కోటవురట్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో రామారావు తెలిపారు. మండలంలో 469 మంది పరీక్ష రాయగా వారిలో 408 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కోటవురట్ల బాలికల ఉన్నత పాఠశాలలో 94మంది పరీక్షలు రాయగా 91 పాసయ్యారు. ఈపాఠశాలలో యల్లపు రిషిత 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. పాములవాక జెడ్పీ పాఠశాలలో 100 మందికి 71మంది ఉత్తీర్ణత సాధించారు. కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో 111మంది పరీక్షలు రాయగా 95మంది ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో 36 మందికి 36 మంది ఉత్తీర్ణత సాధించారు. జల్లూరు జడ్పీ హైస్కూల్‌లో 58 మందికి 52మంది ఉత్తీర్ణత సాధించారు. కె.వెంకటాపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో 70మందికి 63మంది ఉత్తీర్ణత సాధించారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో పరీక్షలు రాసిన 759 మంది విద్యార్థుల్లో 697 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో ఏఎస్ఎస్ఏఎన్ మూర్తి తెలిపారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో 146 మంది విద్యార్థుల్లో 143 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి దార్లపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన కేడీఎస్‌వీ ప్రసాద్ 579 మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలవగా, అదే పాఠశాలకు చెందిన కేవీపీ సాయి 574 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన ఎన్. జీవనకుమార్ 583 మార్కులు, వినయ్ స్కూల్‌కు చెందిన కె. విశాల్ 581 మార్కులు సాధించారు.

తుమ్మపాలలో..

పదో తరగతి ఫలితాల్లో గవరపాలెంలో గల మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా శతశాతం ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ దేవర వెంకటేశ్వర్లు చెప్పారు. 20 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని చెప్పారు.

మండల టాపర్ జగదీశ్

నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి పి.జగదీశ్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్టు ఎంఈవో నరేశ్ చెప్పారు. ఈ హైస్కూల్‌లో 195 మంది పరీక్షలు రాయగా 163 మంది ఉత్తీర్ణత సాధించారు. స్థానిక కేజీబీవీలో 32 మంది బాలికలకు గానూ 30 మంది పాసయ్యారు. నక్కపల్లి అంబేడ్కర్ గురుకులంలో 79 మందికి గానూ 72 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. నక్కపల్లి బాలికోన్నత పఆఠశాల 89 శాతం, నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 55 శాతం, దేవవరం హైస్కూల్ 83శాతం, పెదబోదిగల్లం 89 శాతం, జానకయ్యపేట 71శాతం, రాజయ్యపేట 63శాతం , వేంపాడు హైస్కూల్ 87శాతం, డీఎల్‌పురం 84 శాతం, చినదొడ్డిగల్లు 82 శాతం ఫలితాలు సాధించినట్టు ఎంఈవో నరేశ్ చెప్పారు.

పది ఫలితాల్లో బాలికలపై చేయి

ఎలమంచిలి: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు సత్తా చాటారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు మొదటి రెండు స్థానాలు సాధించారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు అర్రెపు మణి అక్షర టౌన్ ఫస్ట్ 591/600 మార్కులు, ఆళ్ల దామోదర దరహాస్ 588/600 మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పట్టణ బాలికల జెడ్పీ హైస్కూలు విద్యార్థిని వై.యశ్విత 587/600 మార్కులు సాధించింది. యశ్విత తండ్రి తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటారు. కొత్తపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇందుగపల్లి పూజిత 584/600, బాలికల జెడ్పీ హైస్కూలు విద్యార్థిని వై.యోచిత 582/600 మార్కులు సాధించినట్టు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

పాయకరావుపేటలో..

ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని జడ్పీ ఉన్నత పాఠశాలలకు సంబంధించి మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలు సాధించారని మండల విద్యాశాఖాధికారి కేఎన్.గాంధీ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన కోటిపల్లి సత్యధనస్వాతి 592/600 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం సాధించిందన్నారు. మండలంలోని గుంటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గట్టెం శ్రీలేఖ 591/600 మార్కులతో ద్వితీయస్థానం, పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని జాన లలితభవానీ 588/600 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.

శ్రీవివేకానంద విద్యార్థుల విజయభేరి

కశింకోట: స్థానిక వివేకానంద ఇంగ్లీష మీడియం స్కూలులో పదో తరగతి విద్యార్థులు విజయఢంకా మోగించారని స్కూలు అధ్యాపకులు కె.విజయలక్ష్మి, లక్ష్మి తెలిపారు. సోమవారం విడుదలైన పదో తరగతి ఫలితాలలో వై.నందిని 592/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జి. త్రిలేషా 591/600 సాధించి ద్వితీయ స్థానం, వై.తేజ అనిరుధ్ 586/600 మార్కులు సాధించారని చెప్పారు. ఈ ఘన విజయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యం వీరిని అభినందించారు.

గాయత్రి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తాళ్లపాలెం గాయత్రి పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబరిచారు. కె.పవన్, జి.పవన్‌కళ్యాణ్ 582/600 మార్కులు సాధించారు. వై.కిషోర్ 566/600 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరిని అధ్యాపకులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

సెయింట్‌జాన్స్‌లో శతశాతం ఉత్తీర్ణత

కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించారు. పదో తరగతి పరీక్షలు 46 మంది విద్యార్థులు రాశారు. వీరిలో స్నేహితరాయ్ 577/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా.. ఎస్ఎస్.వెంకట వినయ్ 573/600 మార్కులతో ద్వితీయ స్థానం, జి.జి.ప్రశాంత్, పి.నేహ 553 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. కాగా 500మార్కులు పైబడి 22 మంది, 400 మార్కులు పైబడి 38 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.


అర్రెపు మణిఅక్షర శ్రీచైతన్య 591/600


వి.యశ్విత, ప్రభుత్వ పాఠశాల 587/600


ఈ పూజిత, ప్రభుత్వ పాఠశాల 584/600


వై. యోచిత, జడ్పీహెచ్ఎస్ 582/600


దామోదర దరహాస్ శ్రీచైతన్య 588/600


జాన లలితభవాని, జడ్పీహెచ్ఎస్ 588/600


అనిరుధ్ వివేకానంద 586/600


జి. పవన్ గాయత్రి 582/600


కె. పవన్‌కళ్యాణ్ గాయత్రి 582/600

జలజీవన్ మిషన్ అమలుపై ప్రశ్నల వర్షం

సబ్బవరం మండల సమావేశం

సబ్బవరం, ఏప్రిల్ 22 : స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జల్‌జీవన్ మిషన్ పనులపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. రోడ్లు తవ్వేసి ఇష్టానుసారం వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారపాడులో తాగునీటి సమస్య ఉందని, గత సమావేశాల్లో సభ దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోయిందని సర్పంచ్ మామిడి శంకరరావు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ వలన కొత్తగా బోర్లు తీయడానికి కలెక్టర్ అనుమతులు ఉండాలని, పాత బోర్లు మరమ్మతులు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డి. విజయలక్ష్మి తెలిపారు. ఆరు నెలల నుంచి తన ఇంటి ముందే కొళాయి వేయించుకోలేకపోయానని, తాను ప్రజలకు ఏం చేయగలనని పైడివాడఅగ్రహారం సర్పంచ్ వడ్డాది అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అమృతపురంలో కొన్ని రోజులుగా జల్‌జీవన్ మిషన్ పనులు జరగలేదని, రోడ్లు తవ్వేసి వదిలేశారని, నిధులు లేవని చెబితే తామే పంచాయతీ ద్వారా పనులు చేసుకుంటామని సర్పంచ్ బైలపూడి గౌరీ అన్నారు. ఆదిరెడ్డిపాలెంలో కూడా తాగునీటి సమస్య ఉందని ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు సభ దృష్టికి తీసుకొచ్చారు. పనులు జరగని మొక్కుబడి సమావేశాలు ఎందుకని తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆక్రోశం వ్యక్తం చేశారు. కాగా వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రామ్మోహన్‌రావు, ఏవో షేక్ బాబూరావు, వైస్‌ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

చోడమాంబిక అమ్మవారి సారె ఊరేగింపు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 22 : మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక అమ్మవారి సారె ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గండిబోయిన భాను, వెంకట్ దంపతులు, ఆలయకమిటీ చైర్మన్ పితాని చిరంజీవి ఆధ్వర్యంలో అమ్మవారి సారెను ఊరేగించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళవారం గ్రామంలో అమ్మవారి పండుగను వైభవంగా జరుపుతున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పెదలు కాకి శంకరరావు, నూకరాజు, అవతారం, రమణ, అప్పలరాజు, శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత విద్యా ఎక్సలెన్స్ అవార్డు దక్కించుకున్న డైట్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 : భారత విద్యా ఎక్సలెన్స్ అవార్డులను డైట్ ఇంజినీరింగ్ కళాశాల కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో నాణ్యత, నైపుణ్యతతో కూడిన విద్యను పరిగణనలోకి తీసుకుని నైపుణ్య సంస్థల ద్వారా భారత విద్యా సమర్థత అవార్డులను కళాశాల పొందిందన్నారు. అకాడమిక్, పరిశోధనాత్మక అంశాలతో విద్యనందించడంలో అపార అనుభవం కలిగిన కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్‌కు జీవితకాల సాధన అవార్డు (లైఫ్‌టైం అచీవ్‌మెంట్)ను బహూకరించారని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యలో శ్రేష్ఠతకు గుర్తించి డైట్ కళాశాల ఓవరాల్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డును కూడా పొందిందని తెలిపారు. ఈ అవార్డులను ఈనెల 21న ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, ఏఐసీటీఈ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ బహూకరించారని తెలిపారు. కళాశాల విభాగాధిపతులు డాక్టర్ కె.సుజాత, డాక్టర్ గోపాలమ్మ, డాక్టర్ పూర్ణప్రియా, డాక్టర్ ఎ. వెంకటేశ్వరరావు, డాక్టర్ దేవీప్రసాద్, డాక్టర్ పవిత్ర, అకాడమిక్ డీన్ డాక్టర్ పార్వతి, డీన్ అడ్మిన్ డాక్టర్ ఈశ్వరరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణనాగులు హర్షం వ్యక్తం చేశారు.

'వైసీపీని ఓడించండి'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డిని, వైసీపీ నాయకులను ఓడించాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి ఎంపీ మీడియా కో-ఆర్డినేటర్ కొణతాల వెంకటరావు కోరారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రైతాంగాన్ని జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో జిల్లాలోని అనకాపల్లి, తాండవ, ఏటికొప్పాక చక్కెర కర్మాగారాలను ఆధునీకరిస్తానని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటానని చెప్పి మోసం చేశారన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర ఇస్తామని, వ్యవసాయ ఆధునిక పనిముట్లు అందజేస్తామని నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని ఆయన ఆరోపించారు.